# సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 6 । జూన్ । 2024






**యాదగిరిగుట్టలో భారీ వర్షం**
యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.
- 10లో



**చెన్నై నుంచి మిర్యాలగూడకు**
విదేశాల నుంచి అక్రమంగా బంగారం తెచ్చే వారినుంచి కొనుగోలు చేసి మిర్యాలగూడకు తెస్తున్నట్లు తెలిసింది.
- 10లో

గరిష్టం / కనిష్టం
$36^0$ / $27^0$

**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఎరువుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

**రామన్నపేట :** మండలంలోని ఎరువుల దుకాణాలు, ప్రాసెసింగ్ యూనిట్‌లో బుధవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుకాణాల లైసెన్స్, విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ప్యాకెట్లపై సరైన లేబుల్స్ లేని విత్తనాల అమ్మకాలను నిలిపివేయాలని టాస్క్‌ఫోర్స్ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఏడీఏ స్వప్న సూచించారు. విత్తనాల నిల్వ, ధరలను ఏరోజుకారోజు బోర్డుపై ప్రదర్శించాలన్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయించినా, నకిలీ విత్తనాలు అమ్మినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదు తీసుకొని భద్రపరుచుకోవాలని పేర్కొన్నారు.

### నైతిక విజయం సీపీఎందే



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

**భువనగిరి టౌన్ :** భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో నైతిక విజయం తమదేనని సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. ఓట్లు వేసిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం భువనగిరిలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ఏరులై పారినా ప్రజలు తనను ఆదరించారని పేర్కొన్నారు. రానున్నకాలంలో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని చెప్పారు. జూన్ 15, 16 తేదీల్లో భువనగిరిలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీగా గెలుపొందిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. కేంద్రంనుంచి నిధులు తీసుకువచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ నాయకులు దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, లావుడియా రాజు తదితరులు పాల్గొన్నారు.

### యాదాద్రిలో విశేష పూజలు



గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

**యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అర్చన, అభిషేకం చేశారు. ఇక ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

### బస్సుల కోసం నిరీక్షణ

బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. భువనగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం రాత్రి సమయం 10 దాటినా బస్టాండ్‌లోనే పడిగాపులు కాస్తూ కనిపించారు. కొందరు బస్సులు వచ్చే వరకు నిరీక్షించగా.. మరికొందరు ఆటోలు, ట్యాక్సీలను ఆశ్రయించారు. -సాక్షి యాదాద్రి



# తేడా ఎక్కడ?

**లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై బీఆర్ఎస్, బీజేపీ పోస్టుమార్టం**

- బలమైన కేడర్ ఉన్నా మూడో స్థానానికి పడిపోవడంతో గులాబీ పార్టీలో నైరాశ్యం
- గెలుపు ధీమాతో ఉన్నా ఓటమిపాలైన కమలనాథులు
- 28 వేల ఓట్లతో సరిపెట్టుకున్న సీపీఎం



**సాక్షి యాదాద్రి :** భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలపై ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎంలు పోస్టుమార్టం ప్రారంభించాయి. తమకు వచ్చిన ఓట్లపై లెక్కలు వేసుకుంటున్నాయి. కౌంటింగ్‌కు ముందు రోజు వరకు తమకు అనుకూల ఫలితాలు వస్తాయని ఆశించినా.. అంచనాలు తలకిందులయ్యాయి. ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీలో ఈ పరిస్థితి అధికంగా ఉంది.

**బీఆర్ఎస్‌కు కేడర్ ఉన్నా తగ్గిన ఓట్లు**

తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన భువనగిరి ప్రాంతంలో బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోవడం ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. అభ్యర్థి క్యామ మల్లేష్‌కు మద్దతుగా అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు ప్రజలను విశేష స్పందన లభించింది. అయినా ఓట్లు మాత్రం రాలలేదు. 2014లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు చోట్ల పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జనగామలో మినహా మిగతా ఆరు చోట్ల రెండవ స్థానంతో సరిపెట్టుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా మూడో స్థానానికి పడిపోవడంతో పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. తెలంగాణ ఉద్యమ కాలం పార్టీకి భువనగిరి ప్రాంతం బీఆర్ఎస్ పార్టీకి పెట్టని కోటగా ఉంది. బలమైన కేడర్ ఉన్నప్పటికీ మూడవ స్థానానికి పరిమితం కావడం నాయకత్వాన్ని కలవరపెడుతోంది. బీజేపీ అభ్యర్థి బూరనర్సయ్యకు బీఆర్ఎస్ ఓట్లు భారీగా క్రాస్ అయ్యాయన్న చర్చ జరుగుతోంది.

**పట్టున్న ప్రాంతాల్లోనూ సీపీఎంకు నిరాశే..**

తెలంగాణలో సీపీఎం ఒంటరిగా పోటీ చేసిన ఏకైక స్థానం భువనగిరి. కనీసం లక్ష ఓట్లు సాధించాలన్న పట్టుదలతో పార్టీ నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. రాష్ట్ర స్థాయి నేతలు ప్రచారం చేపట్టారు. కానీ, 28 వేల ఓట్లకు పరిమితం అయ్యింది. పార్టీకి పట్టున్న గ్రామాల్లో కూడా ఓట్లు పడలేదని పోస్టుమార్టంలో గుర్తించారు. ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు ఉన్న చోట్ల కూడా తక్కువ ఓట్లు పోలయ్యాయి. అభ్యర్థి జహంగీర్ స్వగ్రామంలో మాత్రమే ఆయన మెజార్టీ దక్కింది. ఇక్కడ ఆయనకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కంటే ఎక్కువ ఓట్లు పోలయ్యాయి.

**గెలుస్తామనుకున్నా ఓడారు**

బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ విజయం సాధిస్తారని పార్టీ నేతలు మొదటి నుంచి ధీమాతో ఉన్నారు. ఎగ్జిట్‌పోల్స్ కూడా కొన్ని అనుకూలంగా చెప్పడంతో వారిలో అంచనాలు ఇంకా పెరిగిపోయాయి. కానీ, రెండవ స్థానంతో సరిపెట్టుకోవల్సి వచ్చింది. అయితే ఓడినా ఓట్లపరంగా అనూహ్యంగా పుంజుకుంది. బీఆర్ఎస్‌ను వెనక్కి నెట్టి రెండవ స్థానంలో నిలిచింది. భువనగిరి, ఆలేరు, ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్లలో గణనీయమైన ఓటు బ్యాంకు పెంచుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో 20 వేల లోపు ఓట్లు వచ్చాయి. ఈ రెండు చోట్ల లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 1.25 లక్షల ఓట్లు సాధించి గ్రాఫ్ పెంచుకుంది. మోదీ చరిష్మా, అయోధ్య శ్రీరాముని అక్షింతలు, బీసీ నినాదం, అభ్యర్థికి గతంలో ఎంపీగా ఉన్న వ్యక్తిగత పరిచయాలు, జాతీయ నాయకుల పర్యటనలు కలిసొచ్చాయి. అయితే విజయం సాధిస్తామని మొదటి నుంచి ధీమాతో ఉన్నప్పటికీ రెండో స్థానానికి పరిమితమైంది. గెలిచే అవకాశం ఉన్నప్పటికీ పలు తప్పిదాల వల్ల ఓడిపోయినట్లు బీజేపీ నాయకుడు ఒకరు తెలిపారు.

# లెక్కింపు.. కొనసాగింపు

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ ప్రారంభం**

- సాయంత్రం 4 గంటల వరకు బండిల్స్ కట్టే ప్రక్రియ
- 5 గంటల నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- అర్ధరాత్రి ఒంటి గంటకు వెలువడిన మొదటి రౌండ్ ఫలితం
- 7,670 ఓట్ల ఆధిక్యంలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



నల్లగొండలోని కౌంటింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రాలను కట్టలు కడుతున్న ఎన్నికల సిబ్బంది

**నల్లగొండ :** వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి కౌంటింగ్ బుధవారం ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌లోని బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్స్‌కు తీసుకొచ్చారు. నాలుగు హాళ్లలో ఏర్పాటు చేసిన 96 టేబుళ్లపై 25 ఓట్లను ఒక్క బండిల్‌గా కట్టారు. ఈ ప్రక్రియ 4 గంటల వరకు సాగింది. ఆ తర్వాత మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. కౌంటింగ్ ప్రక్రియను ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జా, నల్లగొండ కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనా దీప్తి పర్యవేక్షిస్తున్నారు.

**పోటీలో 52 మంది..**

పట్టభద్రుల ఎంఎల్‌సీ ఉప ఎన్నిక పోలింగ్ గత నెల 27న జరిగింది. మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అందులో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి రాకేష్‌రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి మధ్యే ప్రధాన పోటీ ఉంది. ఈ ఎన్నికల్లో మొత్తం 4,63,839 ఓట్లకు గాను 3,36,013 ఓట్లు పోలయ్యాయి.

**96 టేబుళ్లపై లెక్కింపు**

బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ప్రారంభమైన మొదటి ప్రాధాన్యత కౌంటింగ్ ప్రక్రియలో మొదటి రౌండ్ ఫలితం రాత్రి ఒంటి గంటకు వెల్లడైంది. ఓట్లను 96 టేబుళ్లపై టేబులుకు వెయ్యి ఓట్ల చొప్పున ఒక్కో రౌండ్‌లో 96 వేల ఓట్లను లెక్కిస్తున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు 4 రౌండ్లలో పూర్తవుతుంది. ఈ ప్రకారం పోలైన 3,36,013 ఓట్లను లెక్కించడానికి 3 రౌండ్లలో టెబుల్‌కు వేయి ఓట్ల చొప్పున, 4వ రౌండ్‌లో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున లెక్కించనున్నారు. 4 రౌండ్లలో మొదటి ప్రాధాన్యత కౌంటింగ్ పూర్తవుతుంది. గురువారం ఉదయం వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.

**ఓట్ల లెక్కింపు ఇలా..**

పోటీ చేసిన 52 మంది అభ్యర్థులకు సంబంధించిన ప్రత్యేక బాక్సులను ప్రతి టేబుల్‌పై ఉంచుతున్నారు. చెల్లని ఓట్లకు సంబంధించి మరో బాక్సు ఉంచారు. ఇలా వెయ్యి ఓట్లలో ఒక్కో బ్యాలెట్ పేపర్‌ను తెరిచి ఎవరికి మొదటి ప్రాధాన్యత ఓటు పడిందో.. అక్కడి ఏజెంట్లకు చూపించి ఆ అభ్యర్థి బాక్సులో ఆ ఓటు పెడుతున్నారు. చెల్లని ఓటు వస్తే ఏజెంట్లకు చూపి చెల్లని ఓట్ల బాక్సులో వేస్తున్నారు. ఇలా ఆ టేబుల్‌పై మొదటి ప్రాధాన్యతలో వెయ్యి ఓట్లలో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయనేది లెక్క చేయడంతో పాటు చెల్లని ఓట్లు ఎన్ని అనేది లెక్క చేసి చూపుతారు. ఇలా 96 టేబుళ్లపై కౌంటింగ్ ప్రక్రియ సాగుతోంది. ప్రతి టేబుల్‌పై అభ్యర్థులకు వచ్చిన ఓట్లు, చెల్లని ఓట్లు అన్నీ సరి చూసుకుని ఆ రౌండ్ ఫలితం ప్రకటిస్తారు.

**మొదటి ప్రాధాన్యతలో గెలువకపోతే..**

మొదటి ప్రాధాన్యత కౌంటింగ్ పూర్తయిన తర్వాత చెల్లని ఓట్లను తీసివేసి చెల్లిన ఓట్లలో సగానికి ఒక ఓటును కలుపుతు గెలుపు టార్గెట్ నిర్ణయిస్తారు. ఆ టార్గెట్ ప్రకారం మొదటి ప్రాధాన్యత కౌంటింగ్‌లో ఏ అభ్యర్థికైనా మెజార్టీ వస్తే అతడిని గెలిచినట్లు ప్రకటిస్తారు. లేదంటే ఎలిమినేషన్ పద్ధతిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించనున్నారు. అలా జరిగితే కౌంటింగ్ ప్రక్రియ గురువారం రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది.

**మొదటి రౌండ్ ఫలితాలు ఇలా..**


మొదటి రౌండ్‌లో 96,097 ఓట్లను లెక్కించగా అందులో చెల్లిన ఓట్లు 88,369 ఉన్నాయి. 7,728 ఓట్లు చెల్లకుండా పోయాయి. చెల్లిన ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 36,210 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 28,540 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 11,395 ఓట్లు పడ్డాయి. మొదటి రౌండ్‌లో తీన్మార్ మల్లన్న 7,670 ఓట్ల మెజార్టీ సాధించారు.

# వ్యవసాయ ఆధునీకరణ పెరగాలి

- ఉద్యాన పంటలు, విత్తనోత్పత్తికి ఇక్కడి భూములు అనుకూలం
- కమతాలకు అనుగుణంగా యాంత్రీకరణ అవసరం
- బత్తాయి, నిమ్మ రైతులకు భరోసా లేదు
- పంటల ప్రాసెసింగ్, ఎగుమతి విధానం ఇంకా పెరగాలి
- సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయాలి

సాక్షి ఇంటర్వ్యూలో అమేయ కృషి వికాస కేంద్రం చైర్మన్ జిట్టా బాల్‌రెడ్డి







**సాక్షి, యాదాద్రి :** వ్యవసాయ రంగంలో ఇంకా అనేక మార్పులు రావాలి. చిన్నకమతాలకు అనుగుణంగా యాంత్రీకరణ పెరగాలి. వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో పరిశోధనలు రైతుల అవసరాలు దృష్టిలో పెట్టుకుని జరగాలి. రైతుకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండడం లేదు. పండించిన పంటలను ప్రాసెసింగ్ చేసి తానే విక్రయించుకునే స్థితికి రైతు ఎదగాలి. పదేళ్లలో రైతులకు పెద్దగా వ్యవసాయ రంగం కలిసి రాలేదని అమేయ కృషి వికాస కేంద్రం చైర్మన్ జిట్టా బాల్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్ల పూర్తయిన సందర్భంగా సాక్షికి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**రైతులకు ఆర్థిక చేయూత ఎలా ఉంది ?**

గడిచిన పదేళ్లలో రైతులకు ఆర్థిక చేయూత ఆశించినంతగా లభించలేదు. సహకార రంగం బాగా క్షీణించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి నిధులు సింహభాగం కేటాయించడం లేదు. రైతుబంధు లాంటి పథకాలు ఉన్నా వాటితో అర్హుల కంటే అనర్హులకే ఎక్కువ లబ్ధి చేకూరింది. సన్న, చిన్నకారు రైతులు రుణాలకోసం ఇంకా ప్రైవేట్ అప్పులు చేస్తున్నారు. ప్రభుత్వ ఇచ్చే సబ్సిడీలు, రుణాలు రైతులకు పూర్తిస్థాయిలో చేరడం లేదు.

**వరి సాగు లాభసాటిగా ఉందా ?**

వరిసాగు గణనీయంగా పెరిగింది. విస్తారంగా వర్షాలు కురువడంతో ఇతర పంటలు తొలగించి వరి సాగు చేస్తున్నారు. రైతు శ్రమకు అనుగుణంగా గిట్టుబాటు కావడం లేదు. రైతుబంధు ఇస్తున్నా పెరిగిన విత్తనాలు, కూలీ ధరలు, పెట్టుబడులతో లాభసాటిగా లేదు. ఇటీవల క్వింటాకు రూ.2200 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించడంతో కొంతమేరకు రైతులకు మేలు జరుగుతోంది. సరైన గిట్టుబాటు ధర వస్తే రైతులకు రైతుబంధు అవసరం లేదు.

**కొత్తరకం విత్తనాలు వస్తున్నాయా?**

కొత్త రకం విత్తనాలు వస్తలేవు. పండ్ల తోటలకు సంబంధించిన ఏడాది పొడవునా పండే విత్తనాలు లేవు. ఆ దిశగా చర్యలు లేవు. బంగినపల్లి, కేసరి వంటి మొక్కలే ప్రభుత్వం వద్ద ఉన్నాయి. కొత్త వెరైటీలు ఉత్పత్తి చేయడం లేదు. అమేయ కృషి వికాస కేంద్రంలో 13 రకాల మామిడి, నాలుగు రకాల బత్తాయి, నిమ్మ రకాలు ఉన్నాయి. వరిలో బయోసీడ్ విత్తనాలు వాడితే నష్టం. రైతు స్వయంగా విత్తనాలు తయారు చేసుకోవాలి. అపరాల పరిస్థితి అదే. మిల్లెట్, మెట్టపంటలు కనుమరుగు అవుతున్నాయి.

**పామాయిల్ సాగు ఎలా ఉంది?**

సారవంతమైన భూముల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. దీంతో వరి, పత్తి, అపరాల సాగు తగ్గిపోతుంది. పామోలిన్ సాగుతో రైతులకు ప్రయోజనాల కంటే నష్టమే ఎక్కువ. ఇతర పంటలకు ఇచ్చే సబ్సిడీలు, రాయితీలు, డ్రిప్‌లను రద్దు చేసి మొత్తం పామాయిల్ సాగుకే ఇస్తున్నారు. పామాయిల్ సాగు వల్ల భవిష్యత్‌లో రైతులకు మార్కెట్ పరంగా కష్టాలు ఎదురయ్యే అవకాశం ఉంది. జిల్లాలో అన్ని రకాల పండ్ల తోటల సాగుకు అనుకూల వాతావరణం ఉంది. ప్రభుత్వం నాణ్యమైన మొక్కలు, పండిన పండ్లకు తగిన మార్కెట్ వసతులు కల్పించాలి. సమ శీతోష్ణస్థితి వాతావరణం ఈ జిల్లాలో పాలీహౌజ్ లతో రైతులకు ఏం లాభం లేదు.

**ఏ విధమైన సాంకేతికత అవసరం?**

కమతాల విస్తీర్ణం తగ్గుతుంది. ఎకరా, రెండెకరాల సాగుకు రైతులకు చిన్న యంత్రాల అవసరం ఉంది. 50 హార్స్‌పవర్ ట్రాక్టర్లు చిన్న రైతులకు అవసరం లేదు. డ్రోన్లు, చిన్న చిన్న ట్రాక్టర్లు, ఇతర యంత్రాలతో కూలీల కొరత అధిగమించి కలుపు తీయడంతోపాటు పలు రకాల పనులు చేయవచ్చు.

**ఎటువంటి పంటలకు అనువు ?**

ఉమ్మడి నల్లగొండ జిల్లా విత్తన ఉత్పత్తికి అనువైన ప్రాంతం అయినప్పటికీ ఉపయోగించుకోవడం లేదు. సమశీతోష్ణ స్థితిలో ఉన్నందున ఉద్యానవన పంటలకు అనువైనది. అపరాలు పండించడానికి అనుకూలమైన భూమి ఉంది. అయితే ఏటేటా ఈ పంటల సాగు తగ్గుతోంది. పత్తి ధరలు నిలకడ లేక రైతులు నష్టపోతున్నారు. దీంతో పత్తి పండించే రైతులు ప్రత్యామ్నాయ పంటలకు మారుతున్నారు. బత్తాయి, నిమ్మ, మామిడి తోటలు, కూరగాయల సాగుకు అనుకూలం. ఉమ్మడి జిల్లా బత్తాయి సాగుకు ఒకప్పుడు ప్రసిద్ధి. కానీ, ప్రాసెసింగ్ యూనిట్ లేకపోవడంతో సాగు తగ్గుతోంది. పెట్టుబడి కూడా రాకపోవడం, దళారుల దోపిడీ పెరగడంతో రైతులు బత్తాయి తోటలను తొలగిస్తున్నారు.

**రైతులకు ఎలాంటి సలహాలు ఇవ్వాలి?**

వ్యవసాయ యూనివర్సిటీల్లోని పరిశోధనలు, సూచనలు వ్యవసాయ కార్యాలయాల్లోనే ఆగిపోతున్నాయి. విస్తరణ విభాగంలో రైతులు, శాస్త్రవేత్తలతో కలిసి ఏర్పడాలి. ఇది రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయివరకు జరగాలి. క్యూబాలో మాదిరిగా పెరటి తోటలు, మిద్దె తోటలు అభివృద్ధి కావాలి. ప్రకృతి వనరులతో వ్యవసాయం జరగాలి.

# నేటి నుంచి బడిబాట

**సాక్షి,యాదాద్రి :** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. బడీడు, బడిబాట పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించడం బడిబాట ఉద్దేశం. రెండు వారాలపాటు సాగే బడిబాటలో రోజువారీగా క్షేత్రస్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**అడ్మిషన్లు పెంచాలి**

మండల, గ్రామస్థాయి కమిటీలు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లలో కల్పిస్తున్న వసతులు, పథకాలు, బోధన తీరు గురించి తల్లిదండ్రులు, కమ్యూనిటీ పెద్దలకు వివరించాలని కోరారు. ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పాలని కోరారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని పారిశుద్ధ్య సిబ్బందితో పాఠశాల లను శుభ్రం చేయించి సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థులను ఆకర్షించేలా నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజున పాఠశాలలను అందంగా అలంకరించాలని, రంగోలి కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.

# మాట నిలబెట్టుకున్నాడు!

- 'చామల' గెలుపులో రాజగోపాల్‌రెడ్డి కీలకపాత్ర
- ఎన్నికల ఇన్‌చార్జిగా అన్నీ తానై నడిపించిన ఎమ్మెల్యే
- పదోన్నతి ఎప్పుడు వస్తుందోనని కార్యకర్తల్లో చర్చ

**సాక్షి, యాదాద్రి :** మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జిగా సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నేరవేర్చారు. అన్నీ తానై నడిచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించారు. కాగా అభ్యర్థి విజయంతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి వచ్చేనా.. అనే చర్చ జరుగుతోంది.

**నాయకులను సమన్వయం చేస్తూ ప్రచారం**

చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసానికి వచ్చి భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. అప్పటి వరకు భువనగిరి లోక్‌సభ ఇన్‌చార్జ్‌గా ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మారుస్తూ రాజగోపాల్‌రెడ్డికి ఎన్నికల ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించిన విషయం తెలిసిందే. రేవంత్‌రెడ్డి కోరిక మేరకు రాజగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచార బాధ్యతలు తన భుజాలపై వేసుకున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా విస్తృతంగా సమావేశాలు ఏర్పాటు చేసి కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. రోడ్ షోలలో అభ్యర్థితో పాటు ఆయా నియోజకవర్గాల పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై విస్తృతంగా ప్రచారం చేశారు. అసమ్మతి నేతలను బుజ్జగించి పార్టీ విజయం కోసం పని చేయించారు. ఎంపీగా, శాసనసభ్యుడిగా తనకున్న వ్యక్తిగత పరిచయాలతో ఇతర పార్టీల నాయకుల సహకారం కూడా తీసుకున్నారు. ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులను సమన్వయం చేసుకొని ముందుకు సాగారు. చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని భువనగిరిలో జరిగిన ఎన్నికల సభలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. హామీ మేరకు రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఎప్పుడు ఇస్తారోనని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.



సీఎంతో చామల, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

**సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు, చామల**

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, మల్‌రెడ్డి రంగారెడ్డి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా గెలుపొందిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి, ఎన్నికల ఇన్‌చార్జ్‌గా అన్నీ తానై నడిపించిన రాజగోపాల్‌రెడ్డికి, ఎమ్మెల్యేలకు సీఎం అభినందనలు తెలిపారు.